క్లుప్తంగా

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని తెలుగు గంగ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సీపీఎం తిరుపతి ప్రథమ మహాసభలు జయప్రదం చేయాలనే పోస్టర్లను సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్ నాయకులతో కలసి ఆవిష్కరించారు. డిసెంబరు 1వ తేదీన ఉదయం 10 గంటలకు సత్యవేడులోని సాయిబాబా గుడి సమీపంలో సీపీఎం తిరుపతి ప్రథమ మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభలకు రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రమణయ్య, నాయకులు పాల్గొన్నారు.

పోషక విలువలున్న ఆహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న వెంకటసుబ్బమ్మ

రేణిగుంట(ఏర్పేడు) : పోషక విలువలున్న ఆహారాన్ని తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పాపానాయుడుపేట జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకటసుబ్బమ్మ అన్నారు. ఏర్పేడు మండలం పాపానాయుడుపేట జూనియర్ కళాశాలలో శుక్రవారం తిరుపతికి చెందిన ఫిరోజ్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ పర్యవేక్షణలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత వైద్య నిపుణులు డాక్టర్ మౌనిక మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఆరు నెలలకోసారి దంత పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో దంత వైద్యులు డాక్టర్ కుమార్, సహాయకుడు హేమంత్ కుమార్, అధ్యాపకులు ఎస్.ఉమా, వెంకటసురేష్, రామాంజులు, రాఘవరెడ్డి, సువర్ణ, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం



క్రీడా పరికరాలను అందజేస్తున్న మాధురిగోల్డ్ నిర్వాహకులు

శ్రీకాళహస్తి : విద్యతో పాటు క్రీడలు విద్యార్థులకు అవసరమని మాధురిగోల్డ్ నిర్వాహకులు అన్నారు. శుక్రవారం వారు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హాకీ స్టిక్స్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్ బాల్ కిట్లను వితరణ చేశారు. క్రీడల వలన శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కేంద్ర సహాయ మంత్రి



ఆలయం వద్ద కేంద్ర సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈఓ బాపిరెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

గుడిమల్లంలో మహారాష్ట్ర సీఎం కుమారుడు



పూజల్లో శ్రీకాంత్ షిండే కుటుంబం

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు మండలం గుడిమల్లంలోని శ్రీ ఆనందవల్లి సమేత పరశురామేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం మహారాష్ట్ర సీఎం ఏకనాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ బత్తల గిరిబాబు స్వాగతం పలికి ప్రత్యేకంగా దర్శనం చేయించారు.

పింఛను.. వంచన

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. అధికారంలోకి వచ్చి అయిదు నెలలు గడుస్తున్నా ఇంత వరకు కొత్త పింఛన్లకు మోక్షం లభించ లేదు. ఇంతలోనే ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న తీరుపై అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తగా అర్హత కలిగిన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్‌ను అందజేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కింది. దీంతో ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో అసహనం వ్యక్తం అవుతోంది.

- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ హామీ హుళక్కే
- అందుబాటులోకిరాని ప్రభుత్వ వెబ్‌సైట్
- అధికారుల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు
- కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజల అసహనం



బుచ్చినాయుడుకండ్రిగలో పింఛన్ కోసం ఎదురు చూస్తున్న గిరిజన మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో మొత్తం 5,118 వివిధ రకాల పింఛన్లు ఉన్నాయి. మండలంలో మొత్తం 28 పంచాయతీలుండగా 14 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి రోజూ పదుల సంఖ్యలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికి వస్తున్నారు. ప్రభుత్వం నూతన పింఛన్ల కోసం ఎలాంటి వెబ్‌సైట్ తెరవకపోవటంతో అర్హులైన వారు నిరాశతో తిరిగి వెళ్తున్నారు. అలాగే కొత్తగా వివాహాలైన వారు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుందామని వెళ్లినా నిరాశ తప్పడం లేదు.

వంద రోజులైనా తెరుచుకోని సైట్

ఎన్నికల నోటిఫికేషన్ సందర్భంగా నిలిచిపోయిన సైట్, కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు దాటిన ఎందుకు తెరుచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నలకు సరైన సమాధానం లేకపోవడంతో సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా వృద్ధులు కార్యాలయం బయట కనిపిస్తే ఏం చెప్పాలబ్బా అనే ఆలోచనతో ఏదో ఒక సమాధానం చెప్పి తిప్పి పంపిస్తున్నారు. పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులతో పాటు కొత్తగా వివాహాలు చేసుకున్న వారు కొత్త రేషన్ కార్డుల కోసం ఎప్పుడు సైట్ ప్రారంభిస్తారోనని ఎదురు చూస్తున్నారు.

ఉన్నవాటిలోనే తొలగింపు

కొత్త పింఛన్ మాట దేవుడెరుగు.. ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లను తొలగించేందుకు అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. నిబంధనలు అంటూ ఇప్పటికే కొందరి పింఛన్లు పీకేశారు. దీంతో కూటమి నేతల తీరును పేదలు తప్పుపడుతున్నారు. కొత్త పింఛన్ కోసం ప్రజలు ఎదురు చూస్తుంటే, ఉన్న పింఛన్లు తొలగించడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

గత ప్రభుత్వంలో అర్హులందరికీ ...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం వలంటీర్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసేవారు. దరఖాస్తు చేసుకున్న ఆరు నెలలకు ఒక్కసారి కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేది. అయితే నేడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుత ప్రభుత్వం సైట్ నిలిపి వేసింది. అర్హులైన వారు నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సైతం పింఛన్ మంజూరు చేయించాలంటూ అధికారులకు విన్నవించుకుంటున్నారు.



గతంలో పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

పింఛన్ మంజూరు చేయాలి



నా భర్త చనిపోయి ఆరు నెలలు అవుతోంది. సీఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల్లో ఇచ్చే పింఛన్ కోసం ఎదురు చూస్తున్నా. నాకు ముగ్గురు పిల్లలున్నారు. కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తూ, కుటుంబాన్ని పోషిస్తున్నా. పింఛన్‌కు దరఖాస్తు చేయటం కోసం సచివాలయానికి వెళ్తే వెబ్‌సైట్ రావడం లేదని అంటున్నారు. నాకు కొత్త పింఛన్ మంజూరు చేయాలి. – గంగమ్మ, ఎస్టీ కాలనీ, కాంపాళెం

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు

కొత్త పింఛన్ మంజూరుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ఆన్‌లైన్ సైట్ ప్రారంభమైతే కొత్త దరఖాస్తులు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయిన వెంటనే కొత్త పింఛన్ దరఖాస్తులు స్వీకరిస్తాం.

– త్రివిక్రమ్‌రావు, ఎంపీడీఓ, బుచ్చినాయుడుకండ్రిగ

వీధి వ్యాపారులకు స్థలం కేటాయించాలి



నిరసన తెలుపుతున్న వీధి వ్యాపారులు

శ్రీకాళహస్తి : కూరగాయల మార్కెట్ పరిధిలో 30 ఏళ్లగా వ్యాపారం చేసుకుంటున్న వారిని తొలగించడం దారుణమని, వారికి ప్రత్యామ్నాయం చూపాలని వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శివకుమార్, ఏఐటీయూసీ కార్యదర్శి మణి డిమాండ్ చేశారు. శుక్రవారం వారు పురపాలకసంఘ కార్యాలయం వద్ద వీధి వ్యాపారులతో కలిసి నిరసన చేపట్టారు. హైకోర్టు ఆదేశాలను పాటించకుండా వీధి వ్యాపారులను తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోపి, జనార్దన్ పాల్గొన్నారు.

ఉత్తమ హెచ్‌ఎం అవార్డు గ్రహీతకు సత్కారం



ఆనంద్‌ను సన్మానిస్తున్న డీఈవో కుమార్

రేణిగుంట(ఏర్పేడు) : రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయుడుగా సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఏర్పేడు మండలం పల్లం హెచ్‌ఎం తీగల ఆనంద్‌ను శుక్రవారం డీఈవో కె.వి.ఎస్. కుమార్ ఘనంగా సత్కరించారు. మండలంలోని పల్లం హైస్కూల్‌లో జరిగిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ.. పాఠశాలలో మౌలిక వసతులు పెంపొందించడానికి ఆనంద్ కృషి చేశారని, పేద విద్యార్థులు చదువుకోవడానికి దాతల సహకారంతో చేయూత అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నారాయణ స్వామి, నాగలాపురం ఎంఈవో జనార్దన్ రాజు, శ్రీకాళహస్తి మాజీ మునిసిపల్ చైర్మన్ తీగల చంద్రశేఖర్, వెలంపాడు ప్రధానోపాధ్యాయురాలు రేణుక, చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

భార్య, కుమార్తె కనిపించలేదని ఫిర్యాదు



తల్లి హేమావతి, కుమార్తె నయనిక

సత్యవేడు: ఇంటర్వ్యూకని వెళ్లిన తన భార్య, కుమార్తె కనిపించడం లేదంటూ మండలంలోని ఇరుగుళం పంచాయతీకి చెందిన మునిశేఖర్ శ్రీసిటీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం శ్రీసిటీలోని ఓ కంపెనీలో ఇంటర్వ్యూకు వెళ్తూ తన భార్య కుమార్తెను కూడా వెంట తీసుకెళ్లిందన్నారు. ఆ తర్వాత ఇంటికి రాలేదని, బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. వీరి ఆచూకీ తెలిసిన వారు శ్రీసిటీ ఎస్ఐ 9446179833 నంబర్‌కు తెలియజేయాలని ఆయన కోరారు.

మురుగు ఇలా.. పూజలు ఎలా ?

శ్రీకాళహస్తి: కార్తీకమాసంలో సాధారణంగా శివాలయాలు భక్తులతో కిక్కిరిస్తాయి. అయితే పట్టణంలోని పిట్టవారిసందులో ఉన్న దుర్గేశ్వరస్వామి ఆలయంలో మురుగు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతోంది. ఆలయంలో కొన్ని రోజులుగా మురుగు నీరు నిల్వ ఉండడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆలయానికి రావడానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. నిల్వ నీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



దుర్గేశ్వరస్వామి ఆలయంలో చేరిన మురుగు నీరు

నేడు అవగాహన ర్యాలీ

తిరుపతి కల్చరల్ : జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకుని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 8 గంటలకు అవగాహన ర్యాలీ చేపడుతున్నట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ డి.రంగనాయకులు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బాలాజీ కాలనీలోని ఎస్వీ హైస్కూల్ మైదానం నుంచి ప్రకాశం రోడ్డు, గాంధీరోడ్డు, తీర్థకట్ట వీధి, భవానీనగర్ మీదుగా ఎస్వీ పాలిటెక్నిక్ వరకు ర్యాలీ సాగుతుందని వెల్లడించారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డాక్టర్ రమేష్‌రెడ్డి , డాక్టర్ సాయికోటేశ్వర శర్మ, బాలాజీ, దుర్గాప్రసాద్, డాక్టర్ శ్రీనివాస చరణ్, ప్రకాష్ పాల్గొన్నారు.

తిరుచ్చిపై సిరులతల్లి విహారం



తిరుచ్చిపై ఊరేగుతున్న అమ్మవారు

తిరుచానూరు (చంద్రగిరి) : తిరుచానూరు శ్రీపద్మావతీదేవి శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. సిరులతల్లిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయంలోని శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్లకు పాంచరాత్ర ఆగమోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం అలంకార మండపంలో తిరుచ్చిపై ఆశీనులైన శ్రీవారి పట్టపురాణి, నాలుగు మాడవీధులలో ఊరేగారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారికి ధూపదీప నైవేద్యాలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యం

సత్యవేడు : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన పెంచుకొని వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఆరోగ్యం మెరుగు పడుతుందని స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ మండల రిసోర్స్ పర్సన్ జ్యోతీశ్వరన్ పేర్కొన్నారు. శుక్రవారం ఎన్ఆర్ అగ్రహారం పాఠశాలలో విద్యార్థులు, గ్రామస్తులకు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటింటా మరుగుదొడ్డి నిర్మించుకోవాలని గ్రామస్తులను కోరారు. విద్యార్థులు మరుగుదొడ్డికి వెళ్లిన అనంతరం చేతులు, కాళ్లు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని సూచించారు. సర్పంచ్ బాలాజీ, పంచాయతీ సెక్రటరీ కుముద, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎం.ధనలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు కనకరాజు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాగ్రత్త.. ఫోన్‌పే దొంగలు

శ్రీకాళహస్తి : పట్టణంలోని బలరాం థియేటర్ వీధిలోని ఓ కంప్యూటర్ సెంటర్‌లో రెండు మెమరీ కార్డులు, ఓ కెమెరా కొని రూ.3,500 బిల్లు ఫోన్‌పేలో చెల్లించినట్లు మొబైల్‌లో చూపించి ఉడాయించిన యువకుడి ఉదంతమిది.. వివరాల్లోకి వెళితే.. ఫోన్ పేలో సొమ్ములు పడకపోవడంతో ఆ దుకాణం యజమాని సీసీ ఫుటేజీని పరిశీలించగా దొంగగా గుర్తించి అతని ఫొటోను సోషల్ మీడియాలో పెట్టి రూ.3,500 తమ దుకాణంలో మోసం చేసి ఉడాయించాడని ప్రచారం చేశాడు. అయితే ఆదే పంథాలో వీఎంసీ సమీపంలో ఓ కొట్టులో రెండు బియ్యపు బస్తాలు తీసుకుని రూ.3,500 వేసినట్లుగా ఫోన్ పే స్క్రీన్ షాట్ తీసి ఉడాయించినట్లు తెలిసింది. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

వాగుల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

రేణిగుంట : మండలంలోని మామండూరు అడవిలో ఉన్న ప్రమాదకర వాగుల వద్ద శుక్రవారం సాయంత్రం రేణిగుంట ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అటవీశాఖ పరిధిలోని టూరిజం ప్రాంతంలో యాత్రికుల సంఖ్య పెరగడంతో వాగు నీటిలో ఈత కొట్టే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. తాజాగా గురువారం ఓ విద్యార్థి మృతి చెందిన నేపథ్యంలో పోలీసు శాఖ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. మామండూరు డీఆర్‌వో ఎస్.గౌసకరీం తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం మందులు విక్రయిస్తే చర్యలు



బుచ్చినాయుడుకండ్రిగలో ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శుక్రవారం స్పెషల్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. డీలర్ల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి కల్తీ పురుగుమందులు, ఎరువులు ఎట్టి పరిస్థితిలో రైతులకు విక్రయించరాదని హెచ్చరించారు. ఎవరైనా నాసిరకం మందులు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయించాలన్నారు. ఈ దాడుల్లో సత్యవేడు ఏడీఏ సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని రసాయనిక ఎరువులు, పురుగుమందుల దుకాణాలను శుక్రవారం సహాయ వ్యవసాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం , ఏఓ భారతి ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లో నిల్వలకు సంబంధించిన ఎరువులు, వాటి ధరలను పరిశీలించారు. వరి, వేరుశెనగ, మినుము, మామిడి, చెరకు, నిమ్మ, పంటలను సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. మండలంలోని రైతులు పంటల బీమా చెల్లించాలని, లేకుంటే పంటలు దెబ్బతింటే నష్ట పరిహారం ఇవ్వరని తెలిపారు.

వస్తుసేవల పన్నుపై అవగాహన



మాట్లాడుతున్న పద్మావతి

శ్రీకాళహస్తి : వ్యాపారులు సకాలంలో పన్నులు చెల్లించాలని శ్రీకాళహస్తి సర్కిల్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో పన్ను చెల్లింపుదారులకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాపారులు జీఎస్టీ రిటర్నులు సకాలంలో దాఖలు చేయాలని, అదే విధంగా పన్నులు చెల్లించాలన్నారు. ప్రతి వ్యాపారి తమ విక్రయానికి సంబంధించిన ఇన్‌వాయిస్ తప్పనిసరిగా జారీ చేయాలని సూచించారు. రూ.5 కోట్లు కంటే ఎక్కువ టర్నోవర్ ఉన్న వ్యాపారులు తప్పనిసరిగా ఈ–చలాన్ ఇవ్వాలన్నారు. చాలా మంది వ్యాపారులు ఈ–వే బిల్లులు జారీ చేస్తూ బి2బి, బి2ఈ పన్ను చెల్లింపుదారులతో ఇ–ఇన్‌వాయిస్‌లతో అనుసంధానం చేయకుండా లావాదేవీలు జరుపుతున్నట్లు సెంట్రల్ నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ గుర్తించిందన్నారు. కార్యక్రమంలో అధికారులు ధనుంజయ్, అరుణ్‌కుమార్, వ్యాపారులు, ట్యాక్స్ కన్సల్టెంట్లు, ఆడిటర్లు, చార్టెడ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

పోస్టాఫీసు ఖాతాలతో ప్రయోజనం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యవేడు పోస్ట్‌మాస్టర్ సోమనాథం

సత్యవేడు : ప్రభుత్వ పథకాల డబ్బులు తమ ఖాతాలో జమ కావాలంటే పోస్టాఫీసులో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ) ఖాతా ప్రారంభించాలని సత్యవేడు బ్రాంచ్ పోస్టు మాస్టర్ సోమనాథం పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోస్టాఫీసులో ఖాతా ప్రారంభించేందుకు ఆధార్ , ఫోన్ నంబరు, రూ.200 ఉంటే చాలన్నారు. ఒక ఖాతాకు ఒక ఫోన్ నంబరు మాత్రమే ఇవ్వాలని కోరారు. ఖాతా ప్రారంభించిన వారికి పేరుతో ఐడీ, అకౌంట్ నంబరుతో కార్డు అందజేస్తామన్నారు. మండల పరిధిలో 3124 అకౌంట్లు లింక్ కావాల్సి ఉందన్నారు. సత్యవేడు మండల పరిధిలో దాసుకుప్పం, ఆంబాకం, శిరుణంబూదూరు, మదనంబేడు, కొత్తమారికుప్పం, రాచపాళెం, పీవీపురం, రాజగోపాలపురంలలో గ్రామీణ పోస్టాఫీసుల్లో ఈ సౌకర్యం ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముందస్తు పరీక్షలతో వ్యాధుల నిర్ధారణ



కాళమనాయుడుపేటలో వైద్య శిబిరానికి హాజరైన డాక్టర్లు, అధికారులు

సత్యవేడు : బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ తిరుపతి వారి ఆధ్వర్యంలో సత్యవేడు, కాళమనాయుడుపేట పంచాయతీల్లో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం రెండు పింక్ బస్సుల్లో మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టారు. మహిళలకు రొమ్ము కేన్సర్ కోసం మమోగ్రామ్, గర్భాశయ ముఖద్వార కేన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు చేయించుకోవడం వల్ల ప్రాథమిక దశలోనే వ్యాధి నిర్ధారణ అవుతుందని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్, ఎంపీడీఓ చంద్రశేఖర్, సర్పంచులు పి.మంజుల, టి. జయ, బాలాజీ ,రమేష్, డాక్టర్లు చైతన్య భాను, హరిత, ఎంపీహెచ్ ఈఓ సుబ్రమణ్యం, ఎన్ఎంఎం రోసిలిన్, హెల్త్ అసిస్టెంట్లు , ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రమట్టి..కొల్లగొట్టి!

శ్రీకాళహస్తి: ఎర్రమట్టిని కొందరు కేటుగాళ్లు కొల్లగొడుతున్నారు. తొట్టంబేడు మండలం, కల్లిపూడి గ్రామం వద్ద తెలుగుగంగ పిల్ల కాలువ సమీపంలోని ఓ టైల్స్ పరిశ్రమకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మేరకు తెలుగు గంగ జేఈ అనిత తొట్టంబేడు సీఐ తిమ్మయ్యను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగుగంగ స్థలానికి సంబంధించి కల్లిపూడి వద్ద రైట్ అండ్ లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్‌కు పిల్లకాలువ చుట్టూ నీరు పక్కకు దొర్లకుండా ఏర్పాటు చేసిన ఎర్రమట్టిని రాత్రుల్లో అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. ఈ మట్టిని ఓ టైల్స్ పరిశ్రమకు తరలిస్తున్నట్లు సమాచారం ఉందని ఆమె పేర్కొన్నారు. ఎన్ని సార్లు వారించినా వారు సమాధానం చెప్పడం లేదని చెప్పారు. వెంటనే పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.





తెలుగుగంగ కాలువ వద్ద మట్టిని తవ్వేసిన దృశ్యం, మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

ఆక్రమణల తొలగింపుపై నిలదీత

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలోని సన్నిధివీధిలో రోడ్డును ఆక్రమించుకొని ముందుకు వచ్చిన రేకుల షెడ్లు, బ్యానర్లు, బోర్డులు, గచ్చులు, ప్రహరీలను పురపాలక సంఘ కమిషనర్ గిరికుమార్, ఆలయ ఈవో బాపిరెడ్డి సంయుక్తం ఆధ్వర్యంలో తొలగించారు. జల వినాయకుని ఆలయం వద్ద నుంచి ప్రారంభించిన ఈ తొలగింపులు భరద్వాజ తీర్థం వరకు 5 గంటల పాటు కొనసాగింది. ప్రముఖ న్యాయవాది మొదటగా ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా తొలగిస్తారంటూ ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఎస్ఎస్ఆర్ హోటల్‌కు చెందిన గురుదశరథన్, ఆర్యవైశ్య అన్నదాన సత్రానికి సంబంధించిన యాజమాన్యం తొలగింపులను తీవ్రంగా వ్యతిరేకించింది. ఏ విధమైన సర్వే నిర్వహించకుండా, రోడ్డు మార్కింగ్ చేయకుండా ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని అధికారులను నిలదీశారు. ఈక్రమంలో అధికారులు, గురుదశరథన్ మధ్య తీవ్రవాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు రంగప్రవేశం చేసి మీ దస్త్రాలను తీసుకొచ్చి చూపిస్తే ఆపేస్తామని తెలిపారు. ఎట్టకేలకు పేపర్లను చూపి ఆ స్థలం లేకపోవడంతో అక్కడ ఉన్న టైల్స్‌ను తొలగించారు. ఆర్యవైశ్య అన్నదాన సత్రం వద్ద ప్రవేశద్వారం వద్ద మెట్లను తొలగించారు. ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటే తామే తొలగించి ఉండేవాళ్లమన్నారు. హఠాత్తుగా ఉదయం జేసీబీలతో తొలగిస్తే ఇబ్బంది కలుగుతోందన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా రోడ్డు మార్కింగ్ చేయకపోవడం, తొలగించుకునే అవకాశం ఇవ్వకుండా చేయడంపై పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.



దుకాణాల వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు



అధికారులతో వాగ్వాదం చేస్తున్న గురుదశరథన్